క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో బుధవారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత ఈ వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం మణిపాల్ ఆస్పత్రి వైద్యుల నేతృత్వంలో రోగులకు ఈసీజీ, 2డీ ఎకో, షుగర్, బీపీ, పీఎఫ్‌టీ(బ్రీతింగ్ టెస్ట్), క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్స్ నిపుణులు అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ మాజీ అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. ఆదాంవలిసాహెబ్, ఉపాధ్యక్షులు వై.రామచంద్రరావు, వి.సుబ్బారావు, కార్యదర్శి ఏపీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో సమాజ అభ్యున్నతి

ఉయ్యూరు: సేవా కార్యక్రమాలతో సమాజ అభ్యున్నతే ట్రస్టు లక్ష్యమని దిరిశం ప్రభాకర్‌రావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దిరిశం ప్రేమాకర్‌రావు అన్నారు. దిరిశం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉయ్యూరు బస్టాండు సెంటరులో నిర్వహిస్తున్న చలివేంద్రంలో బుధవారం ప్రేమాకర్‌రావు మాతృమూర్తి దిరిశం సరోజిని జ్ఞాపకార్థం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు దిరిశం రత్నాకర్‌రావు, మట్టా జగన్, రంజిత్, రాజేష్, సాత్విక్, ఎంజీ రవి పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో లక్ష్యాలు సాధించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో లక్ష్యాలు సాధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె బుధవారం రామవరప్పాడులోని 3వ సచివాలయం వద్ద నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వ్యాక్సినేషన్ జరుగుతుందా లేదా అనే విషయాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న చిన్నారులకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా సేవలు అందుతున్నదీ లేనిది తనిఖీ చేశారు. ఆమె వెంట పలువురు ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నగర మార్కెట్‌లోకి సరికొత్త సాథి



రామవరప్పాడు: అశోక్ లేలాండ్ నూతన ఉత్పాదన సరికొత్త 'సాథి' వెహికల్‌ను రామవరప్పాడు రింగ్ సమీపంలోని అరుణ మోటార్స్ షోరూమ్‌లో బుధవారం అశోక్ లేలాండ్ రీజనల్ మేనేజర్ బండారు కిరణ్‌కుమార్, ఏరియా మేనేజర్ నసీరుద్దీన్ ఆవిష్కరించారు. మొదటి సాథి వాహనాన్ని నగరానికి చెందిన అంబికా ఎంటర్‌ప్రైజెస్, మరో 5 వాహనాలను ఏలూరు, గుంటూరుకు చెందిన వినియోగదారునికి అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ 1120 కేజీల పే లోడ్, 8.2 అడుగుల పొడవు, 5.3 అడుగుల వెడల్పు, నూతన సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ వాహనం రూ.6.60 లక్షల ధరతో అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఆర్.వి.సుబ్బయ్య, ఎండీ రావెళ్ల సతీష్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తి

గన్నవరం: ఈ నెల 17 నుండి 31వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గుడివాడ డివిజన్ పరిధిలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ విద్యా ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మొత్తం 12,624 మంది విద్యార్థులు

గుడివాడ డివిజన్‌లోని 14 మండలాలకు చెందిన మొత్తం 12,624 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఒకసారి పరీక్షల్లో తప్పిన వారు 784 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిందరి కోసం గుడివాడ డివిజన్‌లో 83 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, టాయిలెట్స్, మంచి వెంటిలేషన్ ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం

పెనమలూరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. తాడిగడపలో బుధవారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి కట్ట రోడ్డు రూ.67.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి, రామ్‌కుమార్, పీతా గోపీచంద్, కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

దేవభక్తుని చక్రవర్తి డిమాండ్

పెనమలూరు: విద్యార్థుల ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌కు తరలివెళ్లే ముందు కానూరులో పార్టీ కార్యాలయంలో చక్రవర్తి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు మోసపూరితమైన హామీలు ఇచ్చి దగా చేసిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలో విద్యార్థులకు, యువతను వంచించారని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4500 కోట్లు బకాయి ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా విద్యార్థుల ఉన్నత చదువులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. పేద విద్యార్థులు డాక్టర్ అవ్వాలన్న కలను సాకారం చేయటానికి జగనన్న ఎంతో కృషి చేశారని, చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థుల కలను చిదిమేశారని అన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు కూటమి ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ఉద్యోగాలు కల్పించకుండా యువతను రోడ్డున పడేశారని ఆరోపించారు. అనంతరం మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపటానికి చక్రవర్తి నాయకత్వంలో నియోజకవర్గ పరిధి నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



యువత పోరు దీక్షలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉప్పాల రాము, సింహాద్రి రమేష్, కైలే అనిల్, దేవభక్తుని చక్రవర్తి

యువత పోరుకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కంకిపాడు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన యువత పోరు ఆందోళనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దావులూరు టోల్‌గేట్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి నేతృత్వంలో చేపట్టిన ర్యాలీలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్, పార్టీ నేతలు మాదు శ్రీహరిరాణి, రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, టి.ఓంకారం, కొండవీటి సుబ్బారావు, వీరంకి రాంబాబు, ఎంపీటీసీలు చిట్టూరు ప్రసాద్, తోకల ఉమాదేవి, వడుగు శ్రీనివాసరావు, బి.సురేష్, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు తదితరులు పాల్గొన్నారు.



దావులూరు టోల్‌గేట్ నుంచి యువత పోరుకు వెళుతున్న కార్ల ర్యాలీ

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో ఘనంగా జరిగాయి. నున్న గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పిమ్మట మాజీ ఎంపీపీ, పార్టీ నాయకులు యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ సర్పంచి యర్కారెడ్డి శివకుమారి, మాజీ ఉప సర్పంచి భీమవరపు శివరామిరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, సాగునీటి సంఘం అధ్యక్షుడు కొరప్రోలు కృష్ణారెడ్డి, హైస్కూల్ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్, సొసైటీ మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంబాపురం గ్రామంలో గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

రామవరప్పాడులో...

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వంశీ, గోపి, ప్రభాకర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మంతెనలో...

కంకిపాడు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని మంతెన గ్రామంలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని బోసు బొమ్మ సెంటరులో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వేడుకలు జరిపారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహానేత విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంద్రపల్లి గగన్, వడ్లమూటి సునీల్, రూబెన్, పెనుమాక సుబ్బయ్య, వెలిసెల రూబెన్, వీరంకి రాంబాబు, ఉప్పులూరు శ్రీనివాసరావు, కొండేటి సర్వేశ్వరరావు, కొండేటి శ్రీనివాసరావు, ప్రవీణ్, సత్యప్రకాష్, కొండేటి వెంకటేశ్వరరావు, మాదు వెంకటేశ్వరరావు, సామేలు పాల్గొన్నారు.



గన్నవరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి

ఉంగుటూరులో...

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తేలప్రోలులో పార్టీ కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. మానికొండ, ఉంగుటూరు, ఇందుపల్లి, పెద్ద అవుటపల్లి, పొట్టిపాడు తదితర గ్రామాల్లో ఆయా గ్రామ నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తియ్యగూర రామిరెడ్డి, జేఏసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, వింత విజయ్‌రెడ్డి, వింత గిరిధర్‌రెడ్డి, మండల కన్వీనర్ విశ్వనాథపల్లి రవికుమార్, దుడ్డ బాలస్వామి పాల్గొన్నారు.

గన్నవరంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గన్నవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక హరిజనవాడలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకుడు నిడమర్తి రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఎగురవేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేసరపల్లిలో వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి నేతృత్వంలో ఎస్సీ కాలనీ, ఎన్‌హెచ్ బైపాస్, యాదవుల బజార్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, అజ్జంపూడి ఎంపీటీసీ దొడ్డ స్వర్ణకుమారి, పార్టీ నేతలు బొడ్డు ఆంజనేయవరప్రసాద్, కొలుసు వెంగళరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నున్న గ్రామంలో కేక్ కట్ చేస్తున్న యర్కారెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు

గన్నవరం రూరల్‌లో...

గన్నవరంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముస్తాబాదలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పార్టీ జెండా ఆవిష్కరించారు. కేకు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పల్లి వీరయ్య, కూరేటి రాజేష్, నాని, ఆరిఫ్, న్యామతుల్లా, విజయ్ తదితరులు పాల్గొన్నారు. బీబీగూడెం గ్రామ సెంటర్‌లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ నాయకులు సామల ఆంజనేయులు, కాట్రు ధర్మారావు, తమ్మిశెట్టి జమీందార్ శ్రీనివాసరావు, కాటాబత్తుల వీర రాఘవయ్య, సామల కృష్ణారావు, ముమ్మనేని శేషయ్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పులూరులో...

కంకిపాడు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఉప్పలూరులో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా నేత బండెల సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంగల నాగయ్య, నిమ్మకూరు రామారావు, లాం ఏసుపాదం, నెరుసు నాని, లాం బసవయ్య, కలపాల ప్రభాకర్‌రావు, టి.చింటూ, లాం భాగ్యరాజు, నెరుసు శ్రీమన్నారాయణ, గొడ్డళ్ల ప్రసాద్, పల్లపు సురేష్, వేముల మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన గొడ్డళ్ల దుర్గారావు, గొడ్డళ్ల శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీలో చేరారు.



మంతెన బోసుబొమ్మ సెంటరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



తేలప్రోలులో కేక్ కట్ చేస్తున్న లాం దిబోర, ఆదినారాయణరెడ్డి



ముస్తాబాదలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి



ఉప్పలూరు సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా నేత బండెల సుబ్బారావు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.5.42 లక్షలు జరిమానా

పెనమలూరు: యనమలకుదురులో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. 44 మంది అధికారులు, 88 మంది సిబ్బందితో 44 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి పి.విజయకుమారి వివరాలు తెలుపుతూ మొత్తం 2917 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేయగా, 150 మంది విద్యుత్ వినియోగదారులు వారికి కేటాయించిన విద్యుత్ లోడ్‌కు అదనంగా విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వారికి రూ.5.42 లక్షలు జరిమానా విధించామని తెలిపారు. తనిఖీల్లో ఈఈ పి.హరిబాబు, ఏడీఈ నవీన్, ఏఈ మురళీకృష్ణ, కానూరు, పటమట, గుణదల సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు వినియోగదారులకు రాయితీతో అవకాశం కల్పిస్తున్నట్లు ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. లోడ్‌ను క్రమబద్ధీకరణ నిమిత్తం దరఖాస్తు చేసుకోవటానికి జూన్ 30 వరకు గడువు ఉందని తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా విద్యుత్ ఉపకేంద్రాలలో స్వీకరిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారుడు ముందుగానే ఇంట్లో విద్యుత్ పరికరాలకు లెక్క కట్టి వాటికి అనుగుణంగా లోడ్ తీసుకోవాలని, విజిలెన్స్ తనిఖీల్లో అదనపు లోడ్ వాడినట్టు రుజువైతే జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. వినియోగదారులు అదనపు విద్యుత్ వినియోగిస్తే ఇళ్లకు ఉన్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. పోరంకిలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు గత రెండేళ్లుగా పరిష్కరించటం లేదన్నారు. హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు, పండుగ బోనస్ రూ.వెయ్యి, 2023లో సమ్మె చేసిన కాలానికి జీతం కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కమిషనర్ భవానీప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరగలేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ మరో గత్యంతరం లేక సమ్మె బాట పట్టాల్సివస్తోందని అన్నారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్.కాశిం, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షురాలు వై.సరళ, నాయకులు ఏడుకొండలు, రత్నకరుణ, వెంకటరెడ్డి, భిక్షాలు, కంచర్ల పద్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలి

ఉంగుటూరు: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ గ్రామంలో ప్రజలతో సమావేశమై నేరాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పోలీసులతో గస్తీకి సహకరిస్తామని యువత ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. వేసవి సెలవుల్లో బంధువుల ఇళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తన ఫోన్ నంబరు 94407 96400 సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ సీఐ కె.వి.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్‌ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పల్లె నిద్రలో నిదురిస్తున్న ఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

మున్సిపల్ కమిషనర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌ను దూషించిన వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు 5వ నంబర్ సచివాలయ పరిధిలో ఉంటున్న ఎం.వేణుగోపాల్ పీజీఆర్‌ఎస్‌లో (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్)లో ఖాళీ నివేశన స్థలాల పన్నుల విషయమై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మార్చి 10వ తేదీన ఫిర్యాదుదారుడు వేణుగోపాల్ ఇంటికి మున్సిపల్ సిబ్బంది వివరాలు తెలిపేందుకు వెళ్లారు. మున్సిపల్ సిబ్బంది ఇచ్చిన ఎండార్స్‌మెంట్ వేణుగోపాల్ తీసుకున్నారు. అనంతరం ఆగ్రహంతో మున్సిపల్ కమిషనర్‌ను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారు. ఈ ఘటనపై కానూరు 5వ నంబరు సచివాలయం కార్యదర్శి సీహెచ్ కిషోర్ వేణుగోపాల్‌పై పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

రోగులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

కంకిపాడు: వేసవిలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయిన రోహిణీకుమారి అన్నారు. బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయిన నాగరాజు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు వై.వెంకటేశ్వరరావు



కంకిపాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని మద్దూరు ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాలు సేకరించి బుధవారం రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోసాల-మద్దూరు రోడ్డు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కూటమి సర్కారుకు కనిపించటం లేదని విమర్శించారు. అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ, రహదారుల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు పి.దుర్గారావు, పి.నాగేశ్వరరావు, పి.సాంబశివరావు, ఎస్.వెంకటేశ్వరరావు, అప్పారావు, ఆదిశేషు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి పీఠాధిపతి శ్రీ మునీంద్ర మహారాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణము చేయడం ద్వారా ముక్కోటి దేవతలను ఆహ్వానించినట్టవుతుందన్నారు. ఈఓ ఎస్.హేమలతాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, దీక్ష స్వీకరణ, అఖండస్థాపన, స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్ మాట్లాడుతూ శైవాగమం అనుసరించి త్రయాహ్నిక దీక్షతో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కానూరులో ప్రారంభమైన తిరుపతమ్మ తిరునాళ్లు

పెనమలూరు: కానూరు గ్రామంలో ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ వారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో తిరుపతమ్మ తిరనాళ్లను బుధవారం ప్రారంభించారు. ఆలయంలో ఉదయం 6.45 గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, గోపూజ, దీక్షాధారణ, అంకురారోహణ, మంటపారాధన, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెను చేశారు. శ్రీలక్ష్మీగణపతి, మహాలక్ష్మి, వెంకటేశ్వర, మృత్యుంజయ, దుర్గా హోమం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గురువారం రాత్రి స్వామివార్ల కల్యాణ మహోత్సవం, ప్రభోత్సవం జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యానికి చర్యలు

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదగటానికి అంగన్‌వాడీ కార్యకర్తలు తగిన చర్యలు తీసుకోవాలని సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణలో భాగంగా పెనమలూరు వెలుగు కార్యాలయంలో రెండవ రోజు కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. చిన్నారుల ఆరోగ్యం, బరువు, పోషకాహారంపై ప్రతి తల్లికి అవగాహన కల్పించాలన్నారు.